క్లుప్తంగా

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న రాణాప్రతాప్, నాయకులు

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి కూతాటి రాణాప్రతాప్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. బకాయిలు విడుదల కాక నిరుపేద విద్యార్థులను కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల, కాలేజీల్లో కనీస సౌకర్యాలను కల్పించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు కాంసారపు రవితేజ, ఎండీ అస్లాం, కొయ్యడ బాబు, రాకేష్, శేఖర్, అంజి తదితరులున్నారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న అంబాల ప్రభాకర్

జమ్మికుంట: హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ గేమ్స్ పోటీల్లో మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల ప్రభాకర్(ప్రభు) పాల్గొని అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రైడ్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ అవార్డును సుప్రీంకోర్టు న్యాయవాది సీమ చౌదరి, తెలంగాణ మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామారావు చేతుల మీదుగా అందుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం సభకు భారీగా తరలిన నాయకులు

మానకొండూర్: ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి ఊట్కూరి నరేందర్‌రెడ్డికి మద్దతుగా కరీంనగర్‌లో జరిగిన సీఎం సభకు మండలంలోని కాంగ్రెస్ నాయకులు సోమవారం భారీగా తరలివెళ్లారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్రాచారి జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఓదెలు, జిల్లా ఉపాధ్యక్షుడుసంపత్‌గౌడ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి, డైరెక్టర్లు సాయిరి దేవయ్య, నాయకులు రేమిడి శ్రీనివాస్‌రెడ్డి, పాండ్రాల కనుకరాజేశం పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్‌అర్బన్: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపూరావు అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాపూరావు మాట్లాడుతూ జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారాయని, అనేక ఒడిదుడుకుల మధ్య వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.కరీంనగర్‌లో జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలు వివాదంగా మారాయని, సమస్యను పరిష్కరించి నిర్మాణ అనుమతి పత్రాలను లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరేందుల ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్‌రావు, నాయకులు చట్ల శంకర్, కొమ్ము గణేశ్, అతికం రాజశేఖర్, శంకర్ రెడ్డి, గుండి కిరణ్, సుదర్శన్ రెడ్డి, సురేష్, రవీందర్, సతీష్, తిరుపతి, శ్రీనివాస్, జయేందర్, శేఖర్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి రూ.7,100

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.7,100 పలికింది. సోమవారం మార్కెట్‌కు 14 వాహనాల్లో 92 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. మోడల్ ధర రూ.6,800, కనిష్ట ధర రూ.6,500కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. క్రయ విక్రయాలను కార్యదర్శులు మల్లేశం, రాజా పర్యవేక్షించారు.



ఒకవైపు నుంచే రాకపోకలు



ఈదులగట్టెపల్లి స్టేజీ వద్ద నిలిచిన పనులు

ఎలా వెళ్లేది.. వచ్చేది

- ఈదులగట్టెపల్లికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో నేషనల్ హైవే పనుల అడ్డంగింత
- రెండు వైపులా సర్వీస్ రోడ్డు చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్
- ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసినా కనిపించని పురోగతి
- భూ సేకరణ సమస్య, ఒకవైపు నుంచి రాకపోకలకు అధికారుల ప్లాన్
- పాత రోడ్డే.. సర్వీస్ రోడ్డు

మానకొండూర్: అధికారుల తప్పిదమో లేక మరే కారణమో తెలియదు కానీ మండలంలోని ఈదులగట్టెపల్లి స్టేజీ వద్ద నేషనల్ హైవే 563 పైనుంచి వరంగల్ వైపు వెళ్లేలా అలాగే గ్రామానికి వెళ్లేలా సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టకుండానే నేరుగా పనులు జరుగుతుండటంతో గ్రామస్తులు రెండు నెలల క్రితం హైవే నిర్మాణ పనులను అడ్డుకున్నారు. రెవెన్యూ, హైవే అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్య విన్నవించినా పురోగతి కనిపించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదులగట్టెపల్లి స్టేజీ నుంచి వరంగల్, కరీంనగర్‌కు వెళ్లి తిరిగి గ్రామానికి వచ్చేలా సర్వీస్ రోడ్డు చేపట్టాల్సి ఉండగా అలాంటిది చేపట్టకుండానే స్టేజీ వద్ద హైవే పనులు చేపట్టారు. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయకపోతే గ్రామానికి ఎలా వెళ్లేదని గ్రామస్తులు ఒక్కసారిగా కంగుతిన్నారు. వెంటనే పనులను అడ్డుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. మా గ్రామానికి మేము ఎలా వెళ్లాలని నేషనల్ హైవే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తమ డిజైన్‌లో సర్వీస్ రోడ్డు లేదని డిజైన్ ఉన్నట్టుగానే పనులు చేపడుతున్నామని హైవే అధికారులు తేల్చి చెప్పడంతో వెంటనే గ్రామస్తులు రెవెన్యూ, ఆర్డీవో, నేషనల్ హైవే అధికారులు, ప్రజాప్రతినిధులను కలిశారు. రెండు నెలలుగా గోడు వెళ్లబోసుకుంటున్నా గ్రామానికి వెళ్లేలా సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేస్తామని హామీ ఇచ్చిన, సర్వీస్ రోడ్డు ఏర్పాటులో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బస్సుల కోసం వేచి చూసే ప్రజలకు ఇబ్బందే..

ఈదులగట్టెపల్లి స్టేజీ వద్ద కరీంనగర్, వరంగల్ వైపు వెళ్లేందుకు సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగనుంది. గతంలో కరీంనగర్, వరంగల్ వైపు ప్రజలు రాకపోకలు సాగించేవారు. 563 రోడ్డు ఏర్పాటుతో బస్టాప్ లేకుండా పోయింది. వరంగల్, హుజూరాబాద్ నుంచి వచ్చే ఆర్డీనరీ బస్సులు కరీంనగర్ నుంచి హుజూరాబాద్– వరంగల్ వైపు వెళ్లేలా ఆర్డీనరీ బస్సులు ఈ స్టేజీ వద్ద ఆగేందుకు ఎలాంటి బస్టాండ్‌ను లేకుండా పోయింది. ఈస్టేజీ వద్ద బస్సులు ఎక్కాల్సిన ప్రజలు ఎంత దూరం వెళ్లి బస్సులు ఎక్కాల్సి ఉంటుందోననిఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు సమస్యలను అధికారులకు మొరపెట్టుకుంటున్నా సమస్య పరిష్కారం కావడంలేదని, ఇప్పటికైనా స్టేజీ వద్ద నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా రోడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భూసేకరణ సమస్య

ఈదులగట్టెపల్లి స్టేజీ వద్ద కరీంనగర్ వైపు నుంచి గ్రామానికి వచ్చేలా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడానికి భూ సేకరణ సమస్య మళ్లీ ఉత్పన్నం కానుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే నేషనల్ హైవే 563 కోసం ఒకే వైపు రెండింతల భూమిని రైతులు కోల్పోయారు. పరిహారం తక్కువైందని కోర్టు వరకూ వెళ్లారు. మళ్లీ సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు రైతుల నుంచి భూమి సేకరించాలంటే సాధ్యమయ్యే పనికాదని అధికారుల ఆలోచన, విద్యుత్ సబ్‌స్టేషన్ వైపు ఎలాంటి భూ సేకరణ జరపకపోవడంతో పాత హైవే రోడ్డు మిగులు భూమిగా ఉంది. దీన్ని డబుల్ రోడ్డుగా మార్చే అవకాశం ఉంది. పాత రోడ్డునే సర్వీస్ రోడ్డుగా మార్చితే ఇవతలి వైపు భూ సమస్య లేకుండా పోతుందని ఖర్చు కూడా తగ్గుతుందని, నవత సీడ్స్ సమీపంలో నేషనల్ హైవేను కలిసే చోటు వరకూ ఈదులగట్టెపల్లి స్టేజీ నుంచి డబుల్ రోడ్డుగా మిగులు భూమిని మార్చితే సరిపోతుందని అధికారులు ప్లాన్.

భద్రతా ప్రమాణాలు పాటించాలి



మైలారంలో పొలంబాట నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ అధికారుల

గన్నేరువరం: స్విచ్‌బోర్డులు, మోటార్, స్టార్టర్ల వద్ద రైతులు భద్రతా ప్రమాణాలు పాటించాలని విద్యుత్ శాఖ ఏడీ నరేందర్ అన్నారు. విద్యుత్ ప్రమాదాలు, లో వోల్టేజీకి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని మైలారం, సాంబయ్యపల్లె గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు సోమవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచడం, ఎర్తింగ్ సక్రమంగా చూస్తామని, హార్వెస్టర్లతో ప్రమాదాలు జరిగే ప్రదేశాలు, తక్కువ ఎత్తులో ఉన్న లైన్ల వద్ద ఎత్తు స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామని, రైతులు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి సంస్థ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈ ఆంజనేయులు, లైన్‌మెన్ రామచంద్రారెడ్డి, ఏఎల్ఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

బస్టాండ్ పరిశీలన



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీఎం రవీంద్రనాథ్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం బస్టాండ్‌ను సోమవారం హుజూరాబాద్ డిపోమేనేజర్ రవీంద్రనాథ్ పరిశీలించారు. బస్టాండ్ వెనుక ప్రాంతంలో వారసంత జరుగుతున్నందున కూరగాయలు, బట్టలు, పండ్ల కొనుగోళ్ల కోసం బైక్‌లపై వస్తున్నందున ప్రమాదాలు జరుగుతాయని, వారసంతకు వచ్చే వాహనదారుల కోసం గ్రామ పంచాయతీ పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. బస్టాండ్‌లో వాహనాలు నిలపడంతో బస్టాండ్‌లోకి వచ్చే బస్సులతో ప్రమాదాలు జరుగుతాయని, కరీంనగర్, వరంగల్ వైపు వెళ్లే డ్రైవర్లు బస్టాండ్‌లోకి వచ్చి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బస్టాండ్ కంట్రోలర్ ముత్యం రావును అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఓర్వలేక అసత్య ప్రచారం



చొప్పదండి: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చొప్పదండి: బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిపై అసత్య ప్రచారం చేస్తూ కాంగ్రెస్ దిగజారుడు రాజకీయం చేస్తోందని బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ విమర్శించారు. పట్టణంలోని రెండు, మూడు వార్డుల్లో సోమవారం బీజేపీ నాయకులతో కలిసి అంజిరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. సర్వేల్లో బీజేపీ గెలుస్తోందని ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని, మేధావులు కాంగ్రెస్ మోసాలను గుర్తించాలని ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని అన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ తదితరులున్నారు.

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి గ్రామంలో మాజీ జెడ్పీటీసీ డా. శ్రీరామ్‌శ్యాం ఆధ్వర్యంలో అంజిరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రశ్నించే గొంతుక అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేయాలని కోరారు. వెంకటేష్, మల్లేష్, రాజ్‌కుమార్, విక్రమ్, సమ్మయ్య పాల్గొన్నారు.

మానకొండూర్: మండల కేంద్రంలో అంజిరెడ్డికి మద్దతుగా బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి



గన్నేరువరంలో రఘునాథ్‌రెడ్డి ప్రచారం

మానకొండూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా సోమవారం మండల కేంద్రంతో పాటు గట్టుదుద్దెనపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు.

జమ్మికుంట: ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, ప్రజాలకు వ్యతిరేకంగా ఉందని, ఉత్పాదక వ్యవసాయ రంగానికి నిధుల కోత విధించారని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలుపించాలన్నారు.

గన్నేరువరం: నరేందర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జీ, పీసీసీ కోఆర్డినేటర్ గాడిపల్లి రఘునాథ్ రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు నరేందర్‌రెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి సునిల్, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

దుకాణాల నిర్వహణకు వేలం

తిమ్మాపూర్: నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి దుకాణాల నిర్వహణకు సోమవారం వేలం నిర్వహించారు. లడ్డూ, పులిహోర విక్రయానికి రూ.3.50 లక్షలు కేటాయించినట్లు ఆలయ ఈవో తెలిపారు. గతేడాది రూ.2.86 లక్షలకు కేటాయించగా ఈసారి రూ.64 వేలు అధికంగా పలికినట్లు వెల్లడించారు. కొబ్బరి ముక్కలు పోగు, పుట్నాలు విక్రయానికి రూ.66 వేలకు వేలం నిర్వహించామని, గతేడాది కంటే ఈసారి రూ.ఆరు వేలు పెరిగిందని ఈవో అనిల్‌కుమార్, చైర్మన్ బండారుపల్లి లక్ష్మణ్ తెలిపారు. టెంకాయల విక్రయ వేలం వాయిదా వేశామని, 28న ఉదయం 11గంటలకు తిరిగి నిర్వహించనున్నామని తెలిపారు.

మైనార్టీలకు అవకాశం ఇవ్వాలి

హుజూరాబాద్: రాష్ట్ర సాంస్కృతిక కళాకారుల వైస్ చైర్మన్‌గా మైనారిటీ వర్గానికి చెందినవారిని ఎంపిక చేయాలని జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు సోమవారం ప్రకటనలో కోరారు. గతంలో ఎస్సీలకు కేటాయించిన వైస్‌చైర్మన్ పదవిని తృణీకరించిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు అవకాశం ఇవ్వాలని, ఎంపీటీసీగా పనిచేసిన కళాకారుడు మహమ్మద్ రహీంను వైస్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు.

గొర్రె కాపరుల సహకార సంఘం ఎన్నికలు



నియామక పత్రాలు అందజేస్తున్న మంజుల

హుజూరాబాద్: హుజూరాబాద్ ప్రాథమిక గొర్రె కాపరుల సహకార సంఘం డైరెక్టర్ల ఎన్నికలు సోమవారం నిర్వహించామని ఎన్నికల అధికారి మంజుల తెలిపారు. సంఘంలో ఏడుగురు డైరెక్టర్ల కోసం 15 మంది పోటీపడ్డారు. వీరిలో డైరెక్టర్లుగా బత్తుల రాజ్‌కుమార్, గంద్రకోట సారయ్య, బాషబోయిన రవి, లెంకలపల్లి రవీందర్, సింగరవేణి రవి, చేపూరి కొమరమ్మ, డి.స్వరూప ఎన్నికయ్యారు. మంగళవారం కార్యవర్గ ఎన్నికలు నిర్వహించున్నామని అన్నారు.అనిల్ కుమార్, ప్రీత్‌పాల్‌సింగ్, మనోజ్ ఉన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మార్చి 18, 19వ తేదీల్లో భారత సాహిత్యంలో పర్యావరణహితం అనే అంశంపై నిర్వహించే జాతీయ సదస్సు బ్రోచర్‌ను సోమవారం కళాశాల ప్రిన్సిపల్ బి.రమేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, పరిశోధకులకు సదస్సు ఎంతో తోడ్పాటు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ ఓదెలుకుమార్, అధ్యాపకులు శ్యామల, శ్రీనివాస్, రాజేంద్రం, గణేశ్, మాధవి, రవి, రాజ్‌కుమార్, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, మమత, రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి పరిధి లాలయ్యపల్లి ఎస్సీ కాలనీలో హుస్నాబాద్–హుజూరాబాద్ ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డు పక్కన మిషన్‌భగీరథ పైపులైన్ లీకేజీతో మంచినీరు కొన్ని రోజులుగా వృథాగా పోతోంది. ఎవరూ పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. నీరు అందక లాలయ్యపల్లి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సువిశాల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిగురుమామిడి సెల్ నంబర్: 7995660448

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఎండుతున్న పంటలకు భరోసా ఏదీ

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



రైతుతో మాట్లాడుతున్న సుంకె రవిశంకర్

రామడుగు: పంటలు ఎండుతున్నాయని రైతులు కంటతడి పెడుతుంటే భరోసా కల్పించేవారు కరువయ్యారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని కోరుట్లపల్లి గ్రామ శివారులో ఎండిన పంటలను సోమవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. సాగునీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే రైతుల ప్రభుత్వమని చెప్పిన ఎమ్మెల్యేకు పంటలు ఎండిపోతుంటే కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎకరం కూడా ఎండిపోనివ్వమన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కనీసం గ్రామాలకు వెళ్లి రైతుల సమస్యలను పరిశీలించారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో నీటితో కళకళలాడిన రామడుగు వాగు ప్రస్తుతం ఎడారిని తలపిస్తోందని, ఎండిన పంటలకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

'జ్యోతిష్మతి'లో ఇన్నోఫెస్ట్–2025



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం

తిమ్మాపూర్: జ్యోతిష్మతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ వార్షిక ఇంటర్ కాలేజియేట్ టెక్నికల్ ఈవెంట్స్ ఇన్నోఫెస్ట్–2025 సోమవారం ప్రారంభమైంది. వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్‌బీవీ.సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరై చైర్మన్ జువ్వాడి సాగర్‌రావుతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. టెక్నాలజీకి అనుగుణంగా నూతన రంగాల వైపు దష్టి సారించాలని సూచించారు, కొత్త ఆవిష్కరణలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇన్నోఫెస్ట్‌లో భాగంగా ఫిబ్రవరి 24, 25 తేదీల్లో టెక్నికల్ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. విద్యార్థులలో పోటీతత్వం, సహకారం, క్రమశిక్షణ, సహనం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు, సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసేందుకు ఫెస్ట్ ఉపకరిస్తుందని సెక్రెటరీ, కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్‌సాయి తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. రెండు రోజుల టెక్నికల్ ఈవెంట్స్‌కి అన్ని విభాగాల్లో కలిపి 411 జట్లు నమోదు చేసుకున్నాయని, ప్రొఫెసర్ ఆర్‌బీవీ.సుబ్రహ్మణ్యం సూచనలు, సలహాలు విద్యార్థులకు దోహదం చేస్తాయన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహక నగదు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. విద్యార్థులతో రెండు రోజులపాటు కళాశాల ఆవరణలో స్టాళ్లు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీన్ వైశాలి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ వి.రాజ్ కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాల పంపిణీ

శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల గ్రామంలో సోమవారం శివరాత్రి విశిష్టతను వివరిస్తూ త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను ప్రబోధ సేవాసమితి సభ్యులు పంపిణీ చేశారు. శివరాత్రి జాగరణపై సేవాసమితి అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీదేవి, రాధిక, నక్షత్ర, పద్మ, ప్రియాంక, సరిత, జ్యోతి, చంద్రమ్మ, కుమారస్వామి, గోపి, నరేశ్, సంతోష్, రామస్వామి, రాహుల్, సిద్ధార్థ్, అభిరామ్, సతీశ్‌చారి, తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



మాట్లాడుతున్న డీఏవో భాగ్యలక్ష్మి

జమ్మికుంట: పట్టణంలోని కేవీకేలో గ్రామ నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కిసాన్ నిధి కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు నైపుణ్యత శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎం.భాగ్యలక్ష్మి, కేవీకే ప్రధాన కార్యదర్శి పరిపాటి విజయగోపాల్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకంతో భూసారం దెబ్బతింటుందని అన్నారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని సూచించారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు, ఏవో ఖాదర్ హుస్సేన్, శాస్త్రవేత్తలు విజయ్, మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్, ప్రశాంతి పాల్గొన్నారు.